# మోడీ మోసాలపై నిరంతరం పోరాడుతాం



వార్త మెయిన్‌లో...


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శనివారం | 08 , 2024 | పేజీలు : 03


# గ్రూప్ 1 ప్రిలిమ్స్ సజావుగా జరిగేలా చూడాలి



## పొరపాట్లు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఈ నెల జరగనున్న గ్రూప్ ప్రిలిమ్స్ పరీక్షకు అధికారులంతా పక్కాగా శనివారంలోగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గ్రూప్ 1 నోడల్ ఆఫీసర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా పరీక్షకు సంబంధించి టిజిపిఎస్సీ రూపొందించిన నిబంధనలపై వారికి అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. టిజిపిఎస్సీ రూపొందించిన నిబంధనలపై అధికారులతో పాటు అభ్యర్థులకు అవగాహన ఉండాలని పేర్కొన్నారు. అధికారులు శనివారం వరకే ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సిసి కెమెరాలు ఏర్పాటు, వాటి పనితీరు, తాగునీరు, టాయిలెట్స్ ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీటింగ్ ఆరేంజ్‌మెంట్లు పక్కాగా చేయాలని, అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని తెలిపారు. ఒక గదిలో 24, 48, 72 మంది ఉండేలా చూసుకోవాలని చెప్పారు. కరీంనగర్‌లో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని వివరించారు. అభ్యర్థులు మూడోసారి ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవుతున్నారని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగవద్దని, అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయా సెంటర్ల వద్ద ఒకే గేటును మాత్రమే ప్రవేశానికి ఉంచాలని తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద సెంటర్ కోడ్ , సెంటర్ పేరు పెద్ద అక్షరాలతో ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒక రోజు ముందే పరీక్ష కేంద్రం వద్దకు వెళ్లి పరిశీలించాలని చెప్పారు. ఈ నెల 9న ఆదివారం ఉదయం 9 గంటల వరకే అభ్యర్థులంతా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 9.30 గంటల నుంచి బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకుంటారని తెలిపారు. 10 గంటలకు ఆయా పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని, ఆ తర్వాత వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో అరగంటకు బెల్ వినిపించేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులంతా టిజిపిఎస్సీ రూపొందించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆయా పరీక్ష జరిగే సమయంలో కేంద్రాలను తరచూ పర్యవేక్షించాలని సూచించారు. సెల్‌ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదని, ఎవరైనా తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులంతా కేటాయించిన పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందే సందర్శించి సౌకర్యాలపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, అడిషినల్ డిసిపి జె.కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీలక్ష్మి , కొండగట్టు జేఎన్టీయు ప్రొఫెసర్ బి.సతీష్ కుమార్, కాళీచరణ్ తదితరులున్నారు.



# అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

### కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష జూన్ 9న ఉదయం 10.30గంటల నుండి మధ్యాహ్నం 1 గంల వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు హాల్ టిక్కెట్లను టిజిపిఎస్‌సి వెడ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని, ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, 10 గంటల తరువాత పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ఒక రోజు ముందుగా నిర్ధారించుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు అందించే వ్యక్తిగత ఒఎంఆర్ షీట్లపై సంబంధిత అభ్యర్థుల వివరాలు ముద్రించి వస్తాయని, అట్టి వివరాలతో పాటు, పరీక్ష నియమ, నిబంధనలను సరి చూసుకోవాలని తెలిపారు. పరీక్షలో అభ్యర్థులకు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా నమూనా ఒఎంఆర్ షీట్‌ను వెబ్ సైట్‌లో పొందుపర్చడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు పాటించవలసిన నియమాలను హాల్ టిక్కెట్లపై కూడా ముద్రించడం జరిగిందని, అభ్యర్థులు ఈ నియమాలను తెలుసుకోవాలని తెలిపారు. ప్రతి అరగంటకు ఒకసారి సమయాన్ని తెలియజేసేలా గంట మ్రోగించడం జరుగుతుందని, అభ్యర్థులు ఇన్విజిలేటర్ల ద్వారా సమయాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే ముందుగానే పరీక్ష సంబంధించిన ప్రతి నియమ, నిబంధనలను చదువుకొని పూర్తిగా తెలుసుకొని ఉండాలని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో పాటు ప్రభుత్వంచే జారీ చేయబడిన ఏదైనా ఒక ఫొటో గుర్తింపు కార్డు (పాస్పోర్ట్, పాన్కార్డు, ఓటరు కార్డు, ఆదార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇతరత్రా) తీసుకురావాలని, క్రొత్తగా దిగిన పాస్ పోర్ట్ సైజ్ ఫొటో హాల్ టిక్కెట్‌పై అతికించాలని తెలిపారు. హాల్ టికెట్‌ల్లో ఫొటో సరిగా లేనట్లయితే టిజిపిఎస్‌సి వెబ్ సైట్‌లో ఉంచిన అండర్ నమూనా తీసుకొని 3 పాస్ ఫోటో సైజ్ ఫొటోలపై గెజిటెడ్ అధికారుల సంతకం చేపించి ఆఖరుగా చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకం తీసుకొని రావాలని తెలిపారు. గ్రూప్1 పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 9 వేల 384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, త్రాగునీరు ఇతరత్రా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి, సహాయం కొరకు ప్రత్యేక హెల్ప్ లైన్ నం. 08736250500 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ

### కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** లోక్ సభ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.లోక్ సభ ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉండడం వలన ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిర్వహించబడలేదని, ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసినందున తిరిగి ఈ నెల 10నసోమవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి ప్రజావాణిలో తమ అర్జీలను అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

